
# ఓ న్యాయ సూత్రం

జొన్నలగడ్డ లలితాదేవి

" 'మనం జీవిస్తూ ఇతరులను కూడా జీవించనీయడం సామాన్య న్యాయ సూత్రం' అన్నాడు సర్ ఎస్ట్రేంజ్. వింటున్నావా? ఎంత గొప్పగా అన్నాడో" చదువుతున్న పుస్తకం ఆపి భార్య ముఖంలోకి చూశాడు ఆంజనేయప్రసాద్.



తలకి కొబ్బరి నూనె రాసుకోబోతూ సీసా అందుకున్న రాగిణి విసుగ్గా చూసింది భర్తవంక. "ఎంతసేపూ ఆ ఇంగ్లీషు నవలలు తెలుగు నవలలు పట్టుకుని కూర్చోబోతే అలా మార్కెట్‌కి పోయి నాలుగు కూరలు పట్టుకు రావచ్చుగా- దిక్కుమాలిన పుస్తకాలూ మీరూనూ-కూటికి వచ్చేనా-గుడ్డకి వచ్చేనా! డబ్బు తగలేసి కొనుక్కోవడం తప్ప."

ఆ మాటకి మండిపోయింది ఆంజనేయ ప్రసాద్‌కి. "బొత్తిగా సాహిత్యాభిలాష లేని మనిషి" అనుకున్నాడు కోపం ఆపుకుంటూ. అతనికి పుస్తకాలంటే వల్లమాలిన ప్రేమ. ఆంగ్ల నవలో-తెలుగు నవలో ఎప్పుడూ అతని చేతిలో వుంటూనే వుంటుంది.

తనలాగే తన భార్య కూడా పుస్తకాలు చదవాలని, ఆంగ్ల నవలలు కాకపోయినా తెలుగు నవలలు అయినా చదివి తనతో సాహిత్య చర్చ చేయాలని అతని చిరకాల వాంఛ. అది ఎప్పుడూ అతనికి తీరని కోరికే. ఎందుకంటే కనీసం పిల్లల పుస్తకాలు కూడా చదవని సాహిత్య ద్వేషి రాగిణి. అతనికి చిన్నప్పుడు ఇంట్లో అన్న, అక్క, అతని తల్లి అంతా ఏదైనా సినిమా చూసి వస్తే అందులోని డైలాగులు, హాస్య సన్నివేశాలు చెప్పకుని పదే పదే నవ్వుకునేవారు. అలా మళ్ళీ ఇంకో సినిమా చూసి వచ్చేదాకా అలా ఏదో ఒకటి చెప్పకుంటూనే వుండేవారు.

అలాగే వారపత్రికలు మాసపత్రికలు ఆ వాడకట్టు వారంతా తలా ఒకటి కొనుక్కుని ఇచ్చిపుచ్చుకునేవారు. ఒకరికొకరు. వాటిల్లో జోక్స్, కథలు కూడా అలాగే చెప్పకుంటూ వుండేవారు చదువుకుని. పెళ్ళి అయ్యాక భార్యామణి, ఎంతసేపూ హీరోయిన్ కట్టుకున్న చీరలు, పెట్టుకున్న నగలు ఇత్యాది వాటిల్ని గురించి ఓ అరగంట భర్తకి చెప్పి విసిగించేదేతప్ప ఏ సరదా సన్నివేశమూ అతని కోరిక మేరకు చెప్పి ముచ్చట తీర్చలేదు ఏ సినిమాకి పోయినా.

"సాయంత్రం పూట అలా పోయి నువ్వే నాలుగు కూరలు తెచ్చుకోవచ్చుగా. కాస్త వాకింగ్ చేసినట్టు వుంటుంది. పొద్దున్నే కూరలు రేటు ఎక్కువుంటాయని వెనకోసారి చెప్పాను. ఇంట్లో కూర్చుని చేసే పాటేముంది?"

"బాగుంది. సాయంత్రానికి అందరూ ఏరిపారేస్తారు. ఆ మిగిలినవి మనం ఎందుకు తెచ్చుకోవాలి" తలకి నూనె రాచుకుంటూ అంది రాగిణి.

"ఏరిపారేస్తారా?"

"అవును-పొద్దున్నించీ కొన్న వాళ్ళంతా ఏరిపడేయరా! అయినా నాకు సాయంత్రం కుదరదు"

"కుదరక ఏమవుతుంది? వున్నది ముగ్గురం. నేనూ, పిల్లాడు వెళ్ళిపోతే అంతా ఖాళీ- హాయిగా రెస్టు తీసుకో



వడమేగా నీ పని. ఆమాత్రం చేయలేవేమిటి? అలా చూడు ఎందరాడవాళ్ళు ఇంట్లో పన్లు–పిల్లల పన్లతోబాటు బయటికిపోయి ఉద్యోగాలు చేసుకుంటూ ఇంటా బయటా ఎంత కష్టపడుతున్నారో. కాస్త కూరలు తెచ్చుకోవడానికి బాధపడతావు."

"వాళ్ళెవరో కష్టపడితే పడనీయండి. నాకేం ఖర్మ? అయినా కాస్త ఇంట్లో పెళ్ళానికి సాయం చేస్తే తప్పేమిటి? మీ మగతనానికి వచ్చిన నష్టం ఏమిటి? తీవ్రంగా అడిగింది రాగిణి.

"అలాంటి తిక్క వాగుడు అవతల పడేయి. నీకు బద్ధకం ఎక్కువ. మా యింట్లో మా అమ్మ, అక్కయ్య తెల్లవారు జామున లేచి రాత్రి పడుకోబోయే వరకు ఏదో పని చేసుకుంటూవే వుండేవారు. పిల్లలు బయట అవీ ఇవీ కొనుక్కుతింటే ఆరోగ్యాలు చెడిపోతాయని వారానికి సరిపడ కారప్పూస, జంతికలు, చేగోడీలు అన్నీ చేసిపెట్టేవారు. నువ్వు ఏం చేస్తున్నావు?"

"మీ అమ్మేనా అవన్నీ చేసింది? మా అమ్మ మటుకు మాకు చేసిపెట్టలేదా?" రోషంగా అడిగింది రాగిణి.

"అదే అనేది. మీ అమ్మ నీకు చేసిపెట్టింది. మా అమ్మ నాకు చేసిపెట్టింది. కానీ నువ్వేం చేస్తున్నావు నీ కొడుక్కి? వుప్మా, బ్రెడ్ తప్ప వాడి మొహాన ఏముందిట? దోసె తినాలంటే హోటలు స్వీటు తినాలంటే స్వీట్ షాపు! ఇంతేగదా! పండుగ వచ్చినా అంతే–నీ అతి పొదుపుతో మేం చేస్తున్నాం. అన్ని పుస్తకాలున్నాయి. వంటలు–పిండి వంటలమీద ఏదో చదివి కాస్త చేయచ్చుగదా ఏదీ రాకపోతే అలా బయట కొనేవన్నీ నీకు దుబారా క్రింద రావా?"

"ఆ పుస్తకాల్లో రాసింది చేస్తే ఇక అయినట్టే–ఎవరూ తినలేరు. వాళ్ళిచ్చే కొలతలు ఎక్కువో తక్కువో తప్ప బాగుండి చావవు. ఎవడు చేస్తాడు?"

"నీతో వాదించేకంటే నేను నోరు మూసుకోవడం మంచిది. ఎనర్జీ అయినా మిగులును" అనుకుంటూ చొక్కా వేసుకుని బాస్కెట్ తీసుకుని కూరలకి బయలుదేరాడు ఆంజనేయ ప్రసాద్. దారిలో అతని అన్న ముకుందరావు కనిపించాడు. మనిషి చిన్నవాడే అయినా శతాధిక వృద్ధుడిలా కనిపిస్తున్నాడు. చొక్కా చిరిగింది. చేతి సంచీలో ఏవో రెండు కూరలున్నట్టున్నాయి. అన్నగారిని చూసేసరికి మనస్సు చివుక్కుమంది ఆంజనేయ ప్రసాద్‌కి. అతనిది ఏమంత పెద్ద వుద్యోగం కాదు. ఆ జీతంలో అతను భార్య– ముగ్గురు పిల్లలు తల్లి తినాలి. రాగిణి సంగతి తల్లికి తెలుసు గనక తిన్నా తినకపోయినా అన్నయ్య దగ్గిరే వుంటుంది. వదిన కూడా సర్దుకుపోయే మనిషి. అందుకే అంతా ఆ జీతంలోనే గుట్టుగా బతుకుతున్నాడు. విచిత్రం ఏమిటంటే తన అక్కయ్య కూడా ఎప్పుడయినా ఆ యింటికే వెడుతుందిగాని తనింటికి రాదు. ఏదన్న ఫంక్షనని పిలిస్తే తప్ప. ఎవరూ రారు. అది ఆంజనేయ ప్రసాద్‌ని బాధించే విషయం. తనకి మంచి వుద్యోగం. జీతంతోబాటు తినేందుకు వున్నది ఒక్కడే కొడుకు. అయినా తను ఏవిధంగానూ తనవారికి ఉపయోగ పడటంలేదు.

"అన్నయ్యా! కులాసానా? అమ్మ బాగుందా? వదిన పిల్లలు అంతా బాగున్నారా?" అని అడిగాడు ఆప్యాయతగా.

ఆ కాస్త పలకరింపుకే పొంగిపోయాడు ముకుందరావు.

"అంతా బాగానే వున్నాంరా! ఏదీ అటు పక్కకి అసలు రావడం మానేశావేం? మొన్న అవ్వయ్య కూడా అడిగింది–మీరంతా ఎలా వున్నారని."

"ఈ మధ్య ఆఫీసులో కాస్త పని ఎక్కువగా వుంది. పైగా నా పుస్తకాల పిచ్చి తెలుసుగా. పొద్దునవూట వద్దామంటే ఇలా ఏదో పని తగిలిస్తుంది రాగిణి. రేపు ఆదివారం తప్పకుండా వస్తాను" అన్నాడు అన్నగారితో నడుస్తూ.

"అక్క–పిల్లలు అంతా బాగున్నారా?" అడిగాడు ఆంజనేయప్రసాద్.

"ఆ! బావగారికి బాగా సుస్తీ చేసింది. సరిగా లేవడం లేదు" విచారంగా అన్నాడు ముకుందరావు. ఆ మాటకు ఉలిక్కిపడ్డాడు ఆంజనేయప్రసాద్.

"సుస్తీ చేసిందని తెలిసి అప్పుడో సారి వెళ్ళివచ్చాను. అయితే ఇంకా తగ్గలేదా?" ఆదుర్దాగా అడిగాడు.

"లేదురా! పాపం పిల్లలతో ఆయనతో అది నానా అవస్థా పడుతోంది" అన్నాడు అక్కగారిని తలచుకుని.

"రేపు వెళ్ళి చూసివస్తాను."

"అలాగే–నేనూ వెళ్ళొస్తారా!" అంటూ ముకుందరావు శెలవు తీసుకున్నాడు.

ఏవో నాలుగు కూరలు అన్యమనస్కంగానే కొన్నాడు ఆంజనేయప్రసాద్. ఈ వూళ్ళోనే వున్నా ఎవరింటికీ వెళ్ళడానికి తనకి కుదిరి చావడంలేదు" అనుకున్నాడు తనలో తనే చిరాకు పడుతూ. కూరలు తీసుకుని ఇల్లు చేరగానే బుట్ట అందుకుంది రాగిణి.

"కూరల రేటు యింతంతేమిటి?"


"ఎంతో కొంతలే! ముందు వంట కానీయి" విసుగ్గా లోపలికి వెళ్ళిపోయాడు.


ఆ రాత్రి భోజనాలయ్యాక "రాగిణీ! అమ్మని మా అన్నయ్యని వదిన్ని పండక్కి పిలిచి బట్టలు పెడదామనుకుంటున్నాను" అన్నాడు ఆంజనేయప్రసాద్.

"ఎందుకు శుద్ధ దండుగ. గంపెడు సంసారం. చాలీ చాలని జీతాలు. ఆయన మనకేం పెడతాడు? మీ అక్కమటుకు–పిల్లాడి పుట్టిన రోజుకు పిలిచి ఓ చీర పెడుతూనే వున్నాం. ఆవిడ మనకేం పెట్టింది మొన్న చూడటానికి వెడితే .–రెవికల గుడ్డ కూడా పెట్టలేదు. పిల్లలు–రోగిష్టి భర్త. ఆవిడ సంసారంలో ఆవిడ డబ్బు ఆవిడకే చాలవు. మనం ఇలా అందరికీ పిలిచి బట్టలు పెట్టడం శుద్ధ వేస్టు."

"వేస్టా! తోడబుట్టిన దానికి ఏడాదికో చీర పెట్టడం కన్న తల్లికి స్వంత అన్నకి బట్టలు పెట్టడం వేస్టా? నేనింత సంపాదిస్తున్నాను. వాళ్ళ అత్తెసరు జీతాలతో అవస్తలు పడుతున్నారు–ఓసారి పండక్కి పిలిచి కాస్త భోజనం పెట్టి బట్టలు పెడితే తప్పా?"

మీకీ బట్టలు పిచ్చేమిటి? మొన్నటికి మొన్న దారిలో కనబడ్డాడని మీ గురువుగారిని ఇంటికి పిలిచి పంచె కండువా పెట్టి పంపారు. ఇప్పుడు అమ్మ–అన్న–




అక్క అంటున్నారు. డబ్బు తగలేయడం తప్ప మీకేం చేతకాదు."

నోరు మూసుకో. భర్త శ్రీరామచంద్రుడిలా వుండాలని కోరుకునే నీలాంటి వాళ్ళంతా మాతృ భక్తికి-పితృ భక్తికి-సోదర ప్రేమకి కూడా ఆయనే మార్గదర్శకుడని ఎందుకు అనుకోలేరు? అమ్మని పిల్చి దగ్గర పెట్టుకుంటే బాధ. అన్నకి బట్టలు పెడితే కన్నీళ్ళు. తమ్ముడి చదువు సాయం చేస్తే మంట. శ్రీరాముడితో పోల్చుకున్నప్పుడు అన్ని విషయాల్లో అలాగే వుండాలి. తన కొడుకు శ్రీరామచంద్రుడవ్వాలని ఏ తల్లి దండ్రులు కోరుకోరేమిటి?

"మీరు లా పాయింట్లులా ఏదో పనికిమాలిన పాయింట్లు తీయకండి-నాకు మండుతుంది!" కోపంగా అంది రాగిణి.

మండుతుందిలే! ఎందుకు మండదు? అసలు నీ స్పెషాల్టీ మండిపోవడమేగా? మా యింటికి వచ్చిన బంధువులకి భోజనాలు పిండివంటలతో పెట్టేది అమ్మ-వెళ్ళేప్పుడు ఏ చీరో-రవికెల గుడ్డో పెట్టకుండా ఆడాళ్ళని పంచ-కండువా పెట్టకుండా మగాళ్ళని పంపలేదు మా నాన్న-మా అమ్మ!

"ఆవిడలా తగలేసింది కనకే మనకి ఆస్తులు లేకుండా పోయాయి. మీ అమ్మ సంగతి ఎవడికి తెలియదు? ఇంటికి వచ్చిన వాళ్ళకి విందులు-బట్టలు-సంవత్సరానికోసారి ఆవిడ తీర్థ యాత్రలు అంటూ అలా డబ్బంతా నాశనం చేశారు" ముఖం గంటుపెట్టుకుంది రాగిణి.

"బాగుంది-మా అందరికీ చదువులు చెప్పించలేదా? ఆస్తి లేకపోతేనేం-అంతా సంపాదించుకోవడం లేదా? మనం సుఖపడటం లేదా?"

"చదివించడం కన్నాక వాళ్ళ బాధ్యత. దానికి మీరంతా జాలి పడిపోనక్కర్లేదు"

"ఎదుటి వాళ్ళు మనకేదన్నా చేస్తే అది వాళ్ళ బాధ్యత. అదే మనం చేయాల్సివస్తే లాభ నష్టాల లెక్కలు. వాళ్ళకింత ఖర్చు పెడుతున్నాం. మళ్ళీ వాళ్ళ ద్వారా మనకి ఏం వస్తుంది. ఏ రూపంలో ఎంత వస్తుంది? అని లెక్కలు-ఛీ-మరీ ఇంత సంకుచిత మనస్తత్వం ఏమిటి నీది?" ఉగ్రంగా అడిగాడు ఆంజనేయప్రసాద్.

సంకుచితం అనుకోండి-ఏదన్నా అనుకోండి-పొద్దున మీరు అన్నారు చూశారా! మనం జీవిస్తూ ఇతరులను కూడా జీవించనీయడం సామాన్య న్యాయ సూత్రం" అని ఆ సూత్రం మాట నాకు తెలియదుగాని ఇప్పటి యీ సూత్రం అదే-మనం ఎవరికన్నా ఏదన్నా పెడితే తిరిగి మనకి అంతా మరో రూపంలో రావాలి. కనీసం అందులో సగం అయినా రావాలి. అలా లేనినాడు మనం పెట్టడం శుద్ధ దండుగ. మన డబ్బు ఖర్చు. అలా తిరిగి రాబట్టుకోగలిగేదగ్గరే మనం పెట్టాలి. అంతేగాని జాలిపడిపోయి లేనివాళ్ళందరికీ ధార పోయడం కాదు. మీ వాళ్ళంతా గొప్ప వాళ్ళయితే నేనూ పెడతాను. తిరిగి మళ్ళీ ఏదో రూపంలో మనకి వాళ్ళు పెడతారని. ప్రస్తుతం వాళ్ళు మనకి పెట్టలేని దరిద్రులు కనుక పైసా ఖర్చు చేయడం నాకిష్టం లేదు. ఎవరేన్యాయ సూత్రాలు చెప్పినా నా న్యాయ సూత్రం మాత్రం ఇదే!" అంటూ విసురుగా వెళ్ళిపోయింది రాగిణి.

అంతేలే! మా యింటికి వచ్చావు. మాకేం తెచ్చావు. మీ ఇంటికి వస్తే మాకేం పెడతావు అని ఎటుపక్కనించయినా తనే గుంజుకోవాలి. ఇలాంటి ఆడాళ్ళు ఇస్తినమ్మా వాయనం. పుచ్చుకుంటి వాయనం. అనే ధోరణి మారితే తప్ప తనలాంటి అల్పప్రాణి నోరెత్తలేదు. ఎందుకొచ్చిన గోల. ఆ బట్టలేవో కొని వాళ్ళింట్లో ఇస్తే సరిపోతుంది. ఇంటికి పిలవడం భోజనాలు పెట్టడం అనే కార్యక్రమం వదిలేసి అనుకుంటూ అటు తిరిగి పడుకున్నాడు నీరసంగా ఆంజనేయప్రసాద్.



ఈ బాలుడ్ని గుర్తు పట్టారా? మన నేటి హిందీ నటుడు గోవిందాయే

